అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 298 | వరంగల్ | మంగళవారం, 01 సెప్టెంబర్ 2026 | పేజీలు: 7



# ఓరుగల్లు గడ్డ సాక్షిగా..
# ఉద్యమ సహచరుడి యాది


## 2న కాళోజీ కళాక్షేత్రంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి యాది సభ

సభను విజయవంతం చేయాలి

తెలంగాణ పూర్వ జేఏసీ నేతల పిలుపు

4







తెలంగాణ ఉద్యమ చరిత్రను కేవలం ఒక రాష్ట్ర సాధన కథగా చూడలేం. అది ఒక నేల తన ఆత్మగౌరవం కోసం, తన ప్రజల హక్కుల కోసం సాగించిన దీర్ఘ పోరాటం. ఆ పోరాటం కఠిన దశలో ఉన్నప్పుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ఉద్యమానికి ఒక ప్రధాన కేంద్రంగా మారిన సమయంలో, ఉద్యమకారులు, విద్యార్థులు, ప్రజా సంఘాల మధ్య ముందువరుసలో నిలిచిన సహచరుల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి ఒకరు. విద్యార్థి ఉద్యమాలతో మమేకమై, ఉద్యమ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ, రాజకీయ ఒత్తిళ్లు, పోలీసు నిర్బంధాలు, కేసులు, అనేక వ్యక్తిగత ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా తెలంగాణ ఆకాంక్ష కోసం నిలిచారు. ఉద్యమ కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఆయన పేరు ప్రజలకు ఎంత పరిచయమో, ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించిన వ్యవస్థలకు కూడా అంతే సుపరిచితమై ఉండేది. "ఉద్యమం విజయాన్ని చూసి ముందుకు వచ్చేవారు చాలామంది... విజయం ఎప్పుడు వస్తుందో తెలియని సమయంలో వెనుకడుగు వేయకుండా నిలబడేవారే నిజమైన ఉద్యమ సహచరులు." -రేపల్లె నరోత్తమ సూరి




## సెప్టెంబరు 17ను అధికారికంగా
# నిర్వహిస్తాం

- ఓటు బ్యాంకు రాజకీయాలతోనే విమోచన దినోత్సవాన్ని విస్మరిస్తున్నారు
- బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు
- రామచంద్రరావు ర్యాలీని విజయవంతం చేయాలి

5

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలతో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా విస్మరిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. - అక్షరశక్తి, పరకాల



## భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



**అక్షరశక్తి,ములుగు:** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహ దేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జితో కలిసి తహసీల్దార్లతో భూ రీసర్వే, భూభారతి తదితర రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో రీసర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించుకొని పనులు పూర్తి చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో కొలతలు, భూ వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. రామచంద్రపురం గ్రామంలో రీసర్వే పూర్తి చేసినందున రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించే పట్టా పాస్‌పుస్తకాల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.భూభారతి, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తూ భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏ సీ పి జితేందర్ రెడ్డి సేవలు అభినందనీయం



**అక్షరశక్తి, హనుమకొండ:** స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా పదవీ విరమణ పొందిన మూల జితేందర్ రెడ్డి సన్మాన కార్యక్రమం మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ వేడుకల మందిరంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమానికి నగర ప్రముఖులు, పోలీసు అధికారులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ జితేందర్ రెడ్డి పోలీసు అధికారిగా 36 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో సేవలందించారని తెలిపారు. విధి నిర్వహణలో విశేష సేవలు అందించడంతో పాటు ఆయన మంచి కళాభిమాని, వివిధ క్రీడల్లో ప్రావీణ్యం కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలోనూ మంచి క్రీడాకారుడిగా గుర్తింపు పొందారని తెలిపారు.తన తండ్రి, అన్నగారి పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ప్రతి రెండేళ్లకోసారి వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులను గుర్తించి ఘనంగా సన్మానించడం అభినందనీయమని నిమ్మల శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్సై రావిళ్ల రామారావు స్వీయ రచనలను ఆలపించారు. జితేందర్ రెడ్డి జీవిత ప్రస్థానం, పోలీసు సేవలో సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ఆయన ఆలపించిన పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పలువురు నగర ప్రముఖులు, పోలీసు అధికారులు జితేందర్ రెడ్డి పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు.

## జడ్పీ సీఈవో గా వసంత



**అక్షరశక్తి,వరంగల్:** జిల్లా పరిషత్ సీఈఓ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వసంత మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిపాలనలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ ఉపసంహరించుకోవాలి

- **బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: ఎర్రబెల్లి స్వర్ణ**



**అక్షరశక్తి, హైద్రాబాద్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూర్చున్న ప్రదేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గంగాజలంతో శుద్ధి చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. శుద్ధీకరణ పేరుతో దళితులను అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్ నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా వెళ్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో గాంధీభవన్ ఎదుట శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. ఒక దళితుడు కూర్చున్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇది మల్లికార్జున్ ఖర్గేను అవమానించడమే కాకుండా భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అవమానించడమేనని పేర్కొన్నారు. ఈ ఘటనను ప్రశ్నించి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన రాహుల్ గాంధీపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.
కులగణన, మహిళలకు రిజర్వేషన్లు, దేశ సంపదపై ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేస్తున్నారని స్వర్ణ ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ''ఈరోజు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ అంటే.. రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై ఎఫ్ఐఆర్'' అని అన్నారు.
రాహుల్ గాంధీ ఇచ్చిన ''డరో మత్.. భయపడకు'' నినాదంతో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు భయపడకుండా ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతారని ఎర్రబెల్లి స్వర్ణ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవడంతో పాటు హల్ద్వానీ ఘటనలో బాధ్యులైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








# రాహుల్ గాంధీపై కేసులు ఎత్తివేయాలి

## డీసీసీ అధ్యక్షుడు అయూబ్



**అక్షరశక్తి,వరంగల్:** కాంగ్రెస్ పార్టీ పోరాటం వ్యక్తుల కోసం కాదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కుల కోసమేనని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు మంగళవారం వెంకట్రామ జంక్షన్ వద్ద జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాహుల్ గాంధీకి మద్దతుగా నినాదాలు చేస్తూ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. రైతులు, యువత, మహిళలు, పేదలు, సామాన్య ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో, ప్రజాక్షేత్రంలో బలంగా వినిపిస్తున్న రాహుల్ గాంధీ గొంతును కేసులతో అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉందని, విమర్శలను స్వీకరించి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాహుల్ గాంధీపై ఎన్ని కేసులు పెట్టినా ఆయన ప్రజా పోరాటాన్ని ఆపలేరని అయూబ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు ధోరణిని విడనాడి కేసులను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకటరాజ్యం, ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల, టౌన్, డివిజన్ అధ్యక్షులు, మహిళా, యూత్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థినుల భద్రతపై షీ టీం–భరోసా అవగాహన సదస్సు



**అక్షరశక్తి, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ఆదేశాల మేరకు గోరుకొత్తపల్లి మండలం జగ్గయ్యపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ టీం-భరోసా సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై స్వప్న కుమారి మాట్లాడుతూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలు మరియు బాలికల భద్రత, సోషల్ మీడియా వినియోగం, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా భద్రతా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే ఆలస్యం చేయకుండా టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు, విద్యార్థినులపై ఎవరైనా అనుచితంగా లేదా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీంకు సమాచారం అందించాలని, షీటీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

# ఇంటి స్థలం కబ్జా చేశారని ఫిర్యాదు

**దాడి చేసి చంపుతామని బెదిరింపులు**

**అక్షరశక్తి,హనుమకొండ:** గుండ్ల సింగారం ఇందిరమ్మ కాలనీలో తన తల్లి పేరుతో ఉన్న 60 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించి, రేకుల ఇంటిని కూల్చివేసి కొత్త ఇల్లు నిర్మించుకున్నారని వ్యాపారి అంగోతు పూర్ణచందర్ నాయక్ జిల్లా కలెక్టర్ తో పాటుగా హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ నం.443/2025లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్లు 174, 175లోని 60 చదరపు గజాల స్థలం తన తల్లి అంగోతు శాంతమ్మ పేరుతో ఆర్‌సీ నం. B430597/95 ప్రకారం ఉందని పేర్కొన్నారు. ఆ స్థలంలో రెండు గదుల రేకుల ఇల్లు నిర్మించుకుని కొంతకాలం నివసించినట్లు తెలిపారు. తన తల్లి అనారోగ్యానికి గురికావడంతో రాంనగర్‌లో అద్దెకు ఉంటున్న సమయంలో ఆమె మృతి చెందిందని, అనంతరం అంత్యక్రియలు సొంత ఇంటి వద్ద నిర్వహించినట్లు చెప్పారు. తాము అక్కడ లేని సమయంలో లకవాత్ బాష, లకవాత్ మంగీ, లకవాత్ బాలు, బాష చిన్న కుమారుడు తదితరులు కలిసి తమ ఇంటిని ఆక్రమించి, రేకుల ఇంటిని అక్రమంగా కూల్చివేసి కొత్త ఇల్లు నిర్మించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు ఇంటి స్థలాన్ని ఖాళీ చేయాలని కోరినా వినకుండా గొడవపడుతూ చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి స్థల ఆక్రమణపై హనుమకొండ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, ఆర్ఐ దిడ్డి సతీష్ 2025 మే 23న తనను స్థలం వద్దకు పిలిపించి పరిసర ప్రాంతాల వారిని విచారిస్తున్న సమయంలో లకవాత్ బాష, లకవాత్ మంగీ, లకవాత్ బాలు, బాష చిన్న కుమారుడు, అంగోతు రవి తదితరులు తనతో గొడవకు దిగారని తెలిపారు. ఆ సమయంలో తనపై పిడిగుద్దులతో దాడి చేసి, కారం పొడి చల్లి, వెదురు కర్రలతో కొట్టారని, స్థలంలోనే చంపి పాతి పెడతామని బెదిరించారని ఆరోపించారు. రేకుల ఇంటిని కూల్చి వేయడం వల్ల సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అనేక సార్లు రెవెన్యూ అధికారులను కలిసినా న్యాయం చెయ్యడం లేదని, కబ్జా చేసిన వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వారిపై వెంటనే చట్టప్రకారం చర్యలు తీసుకుని తన ఇంటి స్థలాన్ని తనకు అప్పగించాలని పూర్ణ చందర్ నాయక్ హన్మకొండ కలెక్టరేట్ ను, పోలీసులను కోరారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి




**అక్షరశక్తి,హనుమకొండ:** సెప్టెంబర్ 1ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం టీజీ ఉద్యోగుల జేఏసీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు పిలుపు మేరకు జిల్లా చైర్మన్ గాజే వేణుగోపాల్, కన్వీనర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 నుంచి నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడుతోందని, పదవీ విరమణ అనంతరం సరిపడా పెన్షన్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రెండో పీఆర్సీని తక్షణమే అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏలను విడుదల చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రభుత్వం బకాయి పెట్టిన బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. కన్వీనర్ ఫణికుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఆర్థిక, సామాజిక, సేవా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలకు పిలవాలని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని సంఘాల నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, టీజీవో కార్యదర్శి రాజేష్‌రెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, యూటీఎఫ్ నాయకులు తాటికాయల కుమార్, సృజన్ ప్రసాద్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబయ్య, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యుగేందర్, రిటైర్డ్ పెన్షనర్స్ అధ్యక్షుడు సాంబయ్య, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సొసైటీకి త్వరలో అన్ని జిల్లాల్లో ఎన్నికలు

**అక్షరశక్తి,హైదరాబాద్:** సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ ఇన్‌చార్జ్ చైర్మన్ ఎం. దాన కిషోర్, IAS ను తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల రెడ్ క్రాస్ చైర్మన్లు, రాష్ట్ర పాలక మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు పెన్షన్ మంజూరు చేయడంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అందించిన సహకారానికి దాన కిషోర్ ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన ప్రత్యేక మెంబర్‌షిప్ డ్రైవ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 వేల మంది సభ్యులను చేర్చడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.దాన కిషోర్ మాట్లాడుతూ.. ఆరోగ్యం, విపత్తు నిర్వహణ, రక్తదానం, పోషణ తదితర సేవా రంగాల్లో తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ పాత్రను మరింత బలోపేతం చేసేందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. మెంబర్‌షిప్ డ్రైవ్ పూర్తయినందున రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, వివిధ జిల్లాల రెడ్ క్రాస్ చైర్మన్లు, రాష్ట్ర పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ వైఫల్యాలపై

# బీఆర్ఎస్ సమరభేరి

- వారంపాటు నియోజవర్గ వ్యాప్తంగా నిరసనలు..
- కార్యకర్తలకు చల్లా ధర్మారెడ్డి పిలుపు



**అక్షరశక్తి, హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల హామీల అమలులో ఘోరంగా విఫలమైందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా వారంపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు. మంగళవారం హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన ధర్మారెడ్డి.. ప్రభుత్వ వైఫల్యాలపై 2న చార్జ్‌షీట్ విడుదల చేసి నియోజకవర్గాల్లో ధర్నాలు, 3న రైతు సదస్సులు, 5న యూత్ ర్యాలీలు, 6న సింగరేణి మైన్స్ వద్ద నిరసనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 'కాంగ్రెస్ బాకీ కార్డులు'ను ఇంటింటికీ పంపిణీ చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తామని పేర్కొన్నారు. రైతు, యువత, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు. రైతులకు యూరియా కొరత, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ హామీ అమలు కాకపోవడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు సాగిందని, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సంక్షోభంలోకి నెట్టబడిందని ధర్మారెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పే వరకు బీఆర్ఎస్ ప్రజాపోరాటం కొనసాగుతుందని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల తర్వాత... మళ్లీ ఒక్కచోట!

- సీకేఎం స్నేహబంధానికి చిరునామాగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- యూకే నుంచి స్నేహం కోసం వచ్చిన సాంబమూర్తి



**అక్షరశక్తి, వరంగల్:** మూడు దశాబ్దాల కాలం... మారిన జీవితాలు... వేర్వేరు ప్రాంతాలు... అయినా చెక్కుచెదరని స్నేహం! వరంగల్‌లోని ప్రముఖ సీకేఎం డిగ్రీ కళాశాలలో 30 సంవత్సరాల క్రితం (1996 బీఎస్సీ మ్యాథ్స్ ) కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు హనుమకొండలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో సమ్మేళనం ఆద్యంతం సందడిగా, ఆప్యాయంగా సాగింది. చాలా సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, కళాశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో చేసిన చిలిపి పనులు, సరదా సంఘటనలు, తరగతి గదిలో జరిగిన ఆసక్తికర ఘటనలను గుర్తుచేసుకుంటూ నవ్వుల్లో మునిగిపోయారు. ఒకప్పుడు కలిసి తిరిగిన స్నేహితులు... నేడు ఎక్కడెక్కడో స్థిరపడినా తమ మధ్య ఉన్న అనుబంధం మాత్రం మారలేదని ఈ సమ్మేళనం మరోసారి చాటిచెప్పింది. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అంశం పూర్వ విద్యార్థి సాంబమూర్తి ప్రత్యేకంగా యూకే నుంచి రావడం. కేవలం స్నేహితులను కలుసుకునేందుకు, మూడు దశాబ్దాల నాటి జ్ఞాపకాలను మళ్లీ పంచుకునేందుకు ఆయన యూకే నుంచి హనుమకొండకు రావడం తోటి మిత్రుల్లో ఆనందాన్ని నింపింది. సాంబమూర్తిని స్నేహితులు ఆప్యాయంగా పలకరించి, ఆయన రాకపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమ్మేళనాన్ని ఓ మధుర జ్ఞాపకంగా మార్చాయి. పూర్వ విద్యార్థులు సంజయ్, సమ్మయ్య, స్వామి, నారాయణరెడ్డి, సాంబమూర్తి, వెంకట్, శ్రీనివాస్, చంద్రయ్య, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# ఓరుగల్లు గడ్డ సాక్షిగా..
# ఉద్యమ సహచరుడి యాది







- రేపల్లె నరోత్తమ సూరి.
అధ్యక్షుడు, బి హ్యూమన్ ఫోరం తెలంగాణ
కన్వీనర్ తెలంగాణ ఆకాంక్ష వేదిక మరియు జేఏసీ

- 2న కాళోజీ కళాక్షేత్రంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి యాది సభ
- సభను విజయవంతం చేయాలి
- తెలంగాణ పూర్వ జేఏసీ నేతల పిలుపు

తెలంగాణ ఉద్యమ చరిత్రను కేవలం ఒక రాష్ట్ర సాధన కథగా చూడలేం. అది ఒక నేల తన ఆత్మగౌరవం కోసం, తన ప్రజల హక్కుల కోసం సాగించిన దీర్ఘ పోరాటం. ఆ పోరాటం కఠిన దశలో ఉన్నప్పుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ఉద్యమానికి ఒక ప్రధాన కేంద్రంగా మారిన సమయంలో, ఉద్యమకారులు, విద్యార్థులు, ప్రజా సంఘాల మధ్య ముందువరుసలో నిలిచిన సహచరుల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి ఒకరు. విద్యార్థి ఉద్యమాలతో మమేకమై, ఉద్యమ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ, రాజకీయ ఒత్తిళ్లు, పోలీసు నిర్బంధాలు, కేసులు, అనేక వ్యక్తిగత ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా తెలంగాణ ఆకాంక్ష కోసం నిలిచారు. ఉద్యమ కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఆయన పేరు ప్రజలకు ఎంత పరిచయమో, ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించిన వ్యవస్థలకు కూడా అంతే సుపరిచితమై ఉండేది. "ఉద్యమం విజయాన్ని చూసి ముందుకు వచ్చేవారు చాలామంది... విజయం ఎప్పుడు వస్తుందో తెలియని సమయంలో వెనుకడుగు వేయకుండా నిలబడేవారే నిజమైన ఉద్యమ సహచరులు."

తాను పుట్టిన నేల కోసం, ఆ నేలపై జీవించే ప్రజల ఆత్మగౌరవం కోసం ఒక మనిషి తన జీవితంలోని విలువైన కాలాన్ని అంకితం చేయడం సాధారణ విషయం కాదు. పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రత్యేకతను ఆయన ఎమ్మెల్యే పదవితో ప్రారంభించి చూడకూడదు; ఆ పదవికి చాలా ముందే ప్రారంభమైన ఆయన ఉద్యమ ప్రయాణంలో చూడాలి. తెలంగాణ కోసం పోరాడిన ఆ రోజుల్లో ఎదురైన ఒత్తిళ్లు, కష్టనష్టాలు, అనిశ్చిత పరిస్థితులు ఆయన నిబద్ధతకు పరీక్షలుగా మారాయి. తరువాత ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, రైతులు–పేదలు–గ్రామీణ ప్రజల సమస్యల పట్ల చూపిన శ్రద్ధ ఆయన ప్రజా జీవితానికి మరో అధ్యాయం. కానీ "పదవి ఆయన ప్రజా జీవితంలో ఒక అధ్యాయం... ఉద్యమం మాత్రం ఆయన జీవితానికి ఒక దిశ." ప్రజలతో ఏర్పడిన ఆ అనుబంధమే ఆయన అంతిమయాత్రలో వేలాది మందిని కన్నీటితో నడిపించింది; "మా ఎమ్మెల్యే" కంటే "మా పెద్దన్న" అనే పిలుపును ఆయనకు సంపాదించి పెట్టింది.

అయితే, పెద్ది సుదర్శన్ రెడ్డి కోసం అన్ని జేఏసీలు, తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన వివిధ రాజకీయ పక్షాలు, ఉద్యమకారులు, ప్రజా సంఘాలు కలిసి యాది సభ నిర్వహించడం ఎందుకు? ఈ ప్రశ్నకు సమాధానం ఒక పార్టీ రాజకీయంలో లేదు; ఉద్యమ సహచర్యంలో ఉంది. సిద్ధాంతాలు వేరైనా, రాజకీయ పక్షాలు వేరైనా, తెలంగాణ కోసం కలిసి నడిచిన కాలం అందరికీ ఒక సామూహిక చరిత్రను ఇచ్చింది. ఆ చరిత్రలో తమతో పాటు నిలిచిన సహచరుడిని రాజకీయ భేదాలకు అతీతంగా స్మరించుకోవడం ఒక ప్రజాస్వామ్య సంస్కృతి. "రాజకీయాలు మనల్ని వేరు చేయవచ్చు... కానీ ప్రజల కోసం కలిసి నడిచిన అడుగుల జ్ఞాపకం మనల్ని మళ్లీ ఒక్కచోట చేర్చగలదు." అందుకే ఈ యాది సభ ఒక వ్యక్తికి మాత్రమే అర్పించే నివాళి కాదు; తెలంగాణ ఉద్యమ సహచర్యానికి, ఆ కాలపు త్యాగాలకు, ప్రజా ఆకాంక్షలకు అర్పించే సామూహిక గౌరవం.

మహాకవి కాళోజి చెప్పిన "పుట్టుక నీది... చావు నీది... బతుకంతా ప్రజలది" అనే మాటకు పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితం ఒక సందర్భోచితమైన అర్థాన్ని ఇస్తుంది. ఒక మనిషి తన కోసం ఎంత సంపాదించాడన్నది చరిత్రకు అంత ముఖ్యమైనది కాదు; తన ప్రజల కోసం ఏమి చేశాడన్నదే అతని అసలైన కొలమానం. నరసంపేటలో ఆయన అంతిమయాత్రకు తరలివచ్చిన ప్రజానీకం ఆ కొలమానానికి ఒక సజీవ సాక్ష్యం. " మనిషి భౌతికంగా వెళ్లిపోవచ్చు... కానీ ప్రజల కోసం చేసిన పని, ప్రజల హృదయాల్లో నాటిన నమ్మకం వెళ్లిపోవు." అందుకే ఈ యాది సభ గతాన్ని మాత్రమే స్మరించుకోకుండా, భవిష్యత్తుకు ఒక ప్రశ్నను కూడా అందించాలి — తెలంగాణ కోసం పోరాడిన తరం మనకు అందించిన ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం అనే విలువలను మనం ఎంతవరకు కాపాడుతున్నాం?

" ఉద్యమం ఒక్కటిగా నిలిచింది... యాది మళ్లీ ఒక్కటిగా చేసింది!"

అందుకే ఓరుగల్లు... వరంగల్... ఉమ్మడి వరంగల్ జిల్లా పోరాటాల గడ్డ ప్రజలారా, తెలంగాణ ఉద్యమకారులారా, అన్ని జేఏసీల సహచరులారా, అన్ని రాజకీయ పక్షాల ఉద్యమ మిత్రులారా, ప్రజా సంఘాల ప్రతినిధులారా — కదిలిరండి! మనతో కలిసి పోరాడిన అమర ఉద్యమ సహచరుడు పెద్ది సుదర్శన్ రెడ్డి యాది సభకు 02-09-2026న మధ్యాహ్నం 3 గంటలకు కాళోజి కళాక్షేత్రానికి తరలిరండి. పార్టీలకు అతీతంగా, రాజకీయ భేదాలకు అతీతంగా, ఉద్యమ బంధంతో ఒక్కటై ఆయనకు ప్రగాఢ శ్రద్ధాంజలి ఘటిద్దాం. " ఉద్యమం మన బంధం... జ్ఞాపకం మన బాధ్యత... సహచరుడికి నివాళి మన కర్తవ్యం!"

ఓరుగల్లు గడ్డ ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించింది; ఇప్పుడు అదే గడ్డ తన ఉద్యమ సహచరుడి జ్ఞాపకాన్ని గౌరవించే బాధ్యతను నిర్వర్తించాలి. రండి... కదిలిరండి... పెద్ది సుదర్శన్ రెడ్డి గారిని స్మరించుకుందాం; తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి చాటిచెప్పదాం!

# సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహిస్తాం

- ఓటు బ్యాంకు రాజకీయాలతోనే విమోచన దినోత్సవాన్ని విస్మరిస్తున్నారు
- బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు
- రామచంద్రరావు ర్యాలీని విజయవంతం చేయాలి




**అక్షరశక్తి, పరకాల :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలతో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా విస్మరిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం పరకాలలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్తినేని ధర్మారావు మాట్లాడారు. సెప్టెంబరు 2న బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు కాజీపేట నుంచి ర్యాలీగా పరకాలకు చేరుకుని, తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అమరవీరుల కుటుంబ సభ్యులు, ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని సాగిన పోరాటంలో పరకాల ప్రాంతానికి చెందిన పలువురు ప్రాణత్యాగం చేశారని ధర్మారావు పేర్కొన్నారు. 1947 సెప్టెంబరు 2న పరకాలలో జాతీయ జెండా ఎగురవేసేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలిరాగా, రజాకార్లు జరిపిన కాల్పులు, లాఠీచార్జిలో పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అనంతరం 1948 సెప్టెంబరు 17న తెలంగాణ ప్రాంతం రజాకార్ల పాలన నుంచి విముక్తి పొందిందని తెలిపారు. అమరవీరుల జ్ఞాపకార్థం పరకాల నడిబొడ్డున నిర్మించిన అమరధామం నాటి పోరాట చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోందన్నారు. రజాకార్ల దౌర్జన్యాలను ప్రతిబింబించే శిల్పాలు నాటి ఘటనలను నేటి తరానికి గుర్తుచేస్తున్నాయని తెలిపారు. డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సెప్టెంబరు 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్‌పీ జయంత్‌లాల్ దేవునూరి మేఘనాథ్, పరకాల కౌన్సిలర్ కుక్కల విజయ్‌కుమార్, బెజ్జంకి పూర్ణచారి, కచం గురుప్రసాద్, గుజ్జ సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శులు సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పున్నం వేణు, దంచనాల కిరణ్, జిల్లా నాయకులు దగ్గు విజేందర్‌రావు, మార్గా రాజభద్రయ్య, కోలనుపాక భద్రయ్య, బాసాని సాంబరాజు, ఓబీసీ అధ్యక్షుడు పైండ్ల రంజిత్, మెంతుల సురేష్, చెందు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి
- వరంగల్ ఎంపీ కడియం కావ్యకు వినతి పత్రం ఇచ్చిన రైతు సంఘాల నాయకులు



**అక్షరశక్తి, హన్మకొండ :** మోదీ ప్రభుత్వం అమెరికా తో చేసుకున్న అన్ని రకాల వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్రంపై పార్లమెంట్ లో ఒత్తిడి తీసుకురావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్యకు రైతు సంఘాల నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం దేశంలోని రైతుల వ్యవసాయ కార్మికుల మరియు పారిశ్రామిక రంగంలోని సంఘటిత అసంఘటిత కార్మికుల జీవితాలను ఫణంగా పెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు బహుళజాతి సంస్థలకు అమెరికా ప్రభుత్వానికి లొంగిపోయి స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను చేసుకుంటుందని వారు విమర్శించారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని 385 రోజులు మహాపడావ్ ఉద్యమాన్ని నడిపించి 736 రైతాంగ ఉద్యమకారుల త్యాగాలతో మూడు నల్ల చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసుకునే విధంగా పోరాడి విజయం సాధించామన్నారు. ఇప్పుడు దొడ్డి దారిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తుందని వారు ఆరోపించారు. 2014 సంవత్సరం పార్లమెంటు ఎన్నికల సమయంలో మోదీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చి దేశ రైతాంగానికి ద్రోహం చేసిందన్నారు. దేశ గ్రామీణ రైతాంగం మోదీ ప్రభుత్వం అనుసరించే కార్పొరేట్ బహుళ జాతి సంస్థల అనుకూల విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో పడి రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని కేంద్రంపై వారు గజమెత్తారు. రైతుల అప్పులను మాఫీ చేయలేని ప్రభుత్వం దేశ కార్పొరేట్ బడా దోపిడీదారులైన అంబానీ అదాని లాంటి దోపిడీదారుల 16 లక్షల కోట్ల రూపాయల అప్పులను మాఫీ చేసిందన్నారు. ఎంపీ కడియం కావ్య కు వినతి పత్రం అందజేసిన వారిలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్ ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు సుధమల్ల భాస్కర్ ఏఐకేకేఎస్ జిల్లా అధ్యక్షులు వల్లందాస్ కుమార్ ఏఐకేఎఫ్ జిల్లా నాయకులు ఐత నగేష్ ఐఎఫ్టియు జిల్లా నాయకులు బండి కుమార్ తదితరులు ఉన్నారు.

# పెద్ది యాది సభను విజయవంతం చేయాలి

- ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థి జేఏసీ మాజీ చైర్మన్ జోరిక రమేష్ పిలుపు

**అక్షరశక్తి, హన్మకొండ :** ఇటీవల మరణించిన నర్సంపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ ఉద్యమనేత, పెద్ది సుదర్శన్ రెడ్డి యాది సభను ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వ జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో సాయంత్రం 3గంటలకు నిర్వహిస్తున్నామని, అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థి జేఏసీ మాజీ చైర్మన్ జోరిక రమేష్ పిలుపు పిలుపునిచ్చారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో ఉద్యమ సమయంలో గడిపిన స్మృతులను నెమరువేసుకోవడం కోసం పెద్ది అన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి యాది సభలో పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పిద్దాం అని జోరిక రమేష్ పిలుపునిచ్చారు. ఈ యాది సభకు తెలంగాణ రాష్ట్ర మాజీ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, వివిధ రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, న్యూ డెమోక్రసీ ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు, కేయూ జేఏసీ బాధ్యులు, వివిధ జేఏసీల బాధ్యులు ప్రసంగిస్తారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, కుల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు అందరూ సకాలంలో పాల్గొని యాది సభను విజయవంతం చేయాలని కోరారు.




# హంటర్ రోడ్డులో మీడియన్ కటింగ్ తాత్కాలిక మూసివేత



**అక్షరశక్తి,హనుమకొండ:** హంటర్ రోడ్డులో అదాలత్ జంక్షన్ నుంచి నీలిమ జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో పలు పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు హంటర్ రోడ్డును పరిశీలించారు. పరిశీలన అనంతరం న్యూ సైన్స్ కాలేజీకి కొంత దూరంలో ఉన్న మీడియన్ కటింగ్‌ను సెప్టెంబర్ 4 నుంచి తాత్కాలికంగా ప్రయోగాత్మక ప్రాతిపదికన మూసివేయాలని నిర్ణయించారు. వాహనదారులు ఈ మార్పును గమనించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# ఉస్మానియా వీసీని కలిసిన తెలుగు అకాడమీ ప్రతినిధులు



**అక్షరశక్తి,హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్‌ను తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ, డైరెక్టర్ ప్రొఫెసర్ బట్టు రమేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల డిగ్రీ, పీజీ కళాశాలలకు సిలబస్‌కు అనుగుణంగా నాణ్యమైన తెలుగు పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన సిలబస్‌కు అనుగుణంగా పుస్తకాల ముద్రణ, సరఫరాపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని వివరించారు. తెలుగు అకాడమీ లక్ష్యాల సాధనకు యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు సహకరించాలని వీసీని కోరినట్లు ప్రొఫెసర్ బట్టు రమేష్ తెలిపారు.


# గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**అక్షరశక్తి,హన్మకొండ:** వడ్డేపల్లి పరిధిలోని వంద ఫీట్ల రోడ్డులో ఉన్న ఎస్‌డీడీ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పొన్నోజు వీరబ్రహ్మచారి వ్యవహరించగా, అధ్యక్షుడిగా డాక్టర్ నల్లాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తంగళ్లపల్లి శంకరాచారి, ప్రధాన కార్యదర్శిగా గూడూరు రవీందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రొయ్యల సత్యం, కోశాధికారిగా రాంపెల్లి రాజ ప్రభు, సాంస్కృతిక కార్యదర్శిగా అటిక రాజు, గౌరవ అధ్యక్షుడిగా పొన్నాజు వీరబ్రహ్మచారి ఎన్నికయ్యారు. సభ్యులుగా కటకం శివప్రసాద్, చెన్నూరు బాపురావు, వనం రమేష్, సిద్ధారెడ్డి, కటకం రవీందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ నల్లాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని కాలనీలో శాశ్వత వినాయక మండపాన్ని నిర్మించామని, ఇది కాలనీలో తొలి అభివృద్ధి సూచికగా నిలిచిందన్నారు. కాలనీలోని ప్రతి వీధి నుంచి ఒక సభ్యుడిని కమిటీలో ఉండేలా ఎంపిక చేశామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. కాలనీవాసులందరూ భక్తిశ్రద్ధలతో సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



GUEST COLUMN

# "మాట మారిందా? ముసుగు మారిందా?"



ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ ఇటీవల అమెరికా పర్యటనలో చేసిన తాజా వ్యాఖ్యలు భారత రాజకీయాల్లో ఒక కీలక ప్రశ్నను ముందుకు తెచ్చాయి: "ఇది నిజమైన భావజాల మార్పా? లేక మారుతున్న ప్రజాభిప్రాయాన్ని గమనించి ఆర్‌ఎస్‌ఎస్ తన అంతర్జాతీయ ప్రతిష్ఠను కాపాడుకునేందుకు వేసుకున్న కొత్త ముసుగా?"

న్యూయార్క్‌లో "వన్ వరల్డ్–వన్ హ్యూమానిటీ" కార్యక్రమంలో భగవత్ మాట్లాడుతూ, "భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించే వ్యక్తి నిజమైన హిందువు కాదు" అని చెప్పారు. అన్ని మతాల మార్గాలు వేరైనా మానవత్వం ఒక్కటేనని, భారతీయ సంప్రదాయం భిన్నత్వంలో ఏకత్వాన్ని విశ్వసిస్తుందని ఆయన వివరించారు. వినడానికి ఈ మాటలు స్వాగతించదగినవే. కానీ సమస్య మాటల్లో కాదు. ఆ మాటలకు ఆరెస్సెస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు గతంలో చేసిన ఆచరణలో ఏమైనా ఆధారం ఉందా అన్నదే అసలు ప్రశ్న?

## అమెరికాలో ప్రశ్నించినది కేవలం ఒక్క భగవత్‌ను మాత్రమే కాదు:

భగవత్ అమెరికా పర్యటనకు ముందే మానవహక్కుల సంస్థలు, మత స్వేచ్ఛా సంస్థలు, భారతీయ-అమెరికన్ పౌరసంఘాలు, హిందూ-ముస్లిం,సిక్కు ఇతర అంతర్మత సంస్థలు నిరసనలు వ్యక్తం చేశాయి. అమెరికా మత స్వేచ్ఛపై కమిషన్ ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించిన వ్యక్తులపై లక్ష్యిత ఆంక్షలు విధించాలని, భగవత్ వీసాను కూడా పునఃపరిశీలించాలని సిఫారసు చేసింది. ఇవి అమెరికా ప్రభుత్వ నిర్ణయాలు అయితే కావు; అవి కేవలం ఆ కమిషన్ సిఫారసులు మాత్రమే. అయినప్పటికీ ఆర్‌ఎస్‌ఎస్ అంతర్జాతీయ ప్రతిష్ఠపై ఏర్పడిన ఒత్తిడికి ఇవి సూచికలుగా కనిపిస్తున్నాయి.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

న్యూయార్క్‌లో భగవత్ కార్యక్రమానికి వ్యతిరేకంగా వివిధ మత, పౌరహక్కుల, మైనారిటీ సంస్థలు నిరసనలకు దిగాయి. న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ కూడా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే మరోవైపు 200కుపైగా హిందూ-అమెరికన్ సంస్థలు ఈ కార్యక్రమానికి  కొందరు అనుకూలంగా, మరికొందరు వ్యతిరేకంగా ప్రకటనలు, ప్రదర్శనలు, నినాదాలు ఇచ్చాయి. కాబట్టి అమెరికాలో మొత్తం భారతీయ సమాజం భగవత్‌కు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని , లేదా అనుకూలంగా ఉందని చెప్పడం కూడా వాస్తవం కాదు.
అయితే అసలు ప్రశ్న ఇదే: అమెరికాలో మైనారిటీల హక్కులు, మానవత్వం, భిన్నత్వం గురించి ఇంత బలంగా మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం, అదే ప్రమాణాలను భారత్‌లో కూడా ఎందుకు సమానంగా అమలు చేయలేదనే విమర్శకు సమాధానం ఏమిటి?

## 'బుల్డోజర్ న్యాయం'పై మౌనం ఎందుకు?

----------

మోదీ గత 12 ఏళ్ళ ప్రభుత్వ పాలనలో, ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్, కొన్ని ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, నేర ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తుల ఇళ్లు, దుకాణాలు లేదా ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడం పెద్ద రాజకీయ అంశంగా మారింది. "హ్యూమన్ రైట్స్ వాచ్"  ప్రకారం ఇటువంటి చర్యలు అనేక సందర్భాల్లో ముస్లింల ఆస్తులపై కక్ష పూరితంగా,మత అసహనం, పక్షపాత ధోరణితో ప్రభావం చూపాయి.

## హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా తప్పు పట్టింది:

హర్యానాలోని 'నూహ్ హింస' తర్వాత ముస్లిం ఆస్తుల కూల్చివేతలపై పంజాబ్-హర్యానా హైకోర్టు కూడా తీవ్ర ప్రశ్నలు లేవనెత్తింది. మణిపూర్‌లో జరిగిన హింసలో 200 మందికి పైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇళ్లు, చర్చిలు ధ్వంసమయ్యాయి.  చివరకు సుప్రీంకోర్టు 2024 నవంబరులో 'బుల్డోజర్ జస్టిస్' చట్టపరంగా అంగీకారయోగ్యం కాదని పేర్కొంది. నేరారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తి ఆస్తిని కేవలం ఆరోపణ ఆధారంగా కూల్చలేమని స్పష్టమైన విధానపరమైన రక్షణలు విధించింది. ఇక్కడే భగవత్ తాజా ఉపన్యాసం అసౌకర్యకరమైన ప్రశ్నను ఎదుర్కొంటుంది. ముస్లింలు భారతదేశంలో ఉండకూడదనుకోవడం హిందుత్వం కాదంటే—ముస్లింల ఇళ్లను, వ్యాపారాలను, ప్రార్థనా స్థలాలను చట్టబద్ధ ప్రక్రియకు విరుద్ధంగా కూల్చడాన్ని కూడా హిందుత్వం కాదని ఆయన ఎప్పుడైనా ఇదే స్థాయిలో బహిరంగంగా ప్రకటించారా? అని ప్రశ్నిస్తే? లేదనే సమాధానం వస్తుంది. ఇది భగవత్‌కు వ్యక్తిగతంగా మాత్రమే కాదు, మొత్తం సంఘ్ పరివార్‌కు సంబంధించిన నైతిక ప్రశ్న కూడా.

## మోదీ ఎన్నికల ప్రసంగాలపై కూడా ఇదే ప్రశ్న

2024 ఎన్నికల సమయంలో మోదీ చేసిన కొన్ని ప్రసంగాలపై దేశంలోనే కాక అంతర్జాతీయంగా కూడా తీవ్ర విమర్శలు వచ్చాయి. "ఇన్‌ఫిల్ట్రేటర్లు", ఎక్కువ మంది ముస్లింలు ఎక్కువమంది

పిల్లల్ని కంటారు, హిందువుల సంపదను అంతా ముస్లింలకు పంచుతారనే వ్యాఖ్యలు చేశారు. వాటిపై వివాదం చెలరేగింది. ఈ విషయంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా, ఎన్నికల కమీషనర్ పట్టించుకోలేదు. మోదీ ఆ తరువాత తాను ఇస్లాం లేదా ముస్లింలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేయాల్సి వచ్చింది.

కానీ,"హ్యూమన్ రైట్స్ వాచ్ " 2024 ఎన్నికల ప్రచారంలో ముస్లింలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, మైనారిటీలపై వివక్షకు దారితీసే రాజకీయ వాతావరణం ఏర్పడిందని విమర్శించింది. అయితే ఆ సమయంలో కూడా మోహన్ భగవత్ నుంచి "ఇలాంటి భాష హిందుత్వానికి విరుద్ధం; బీజేపీ నాయకులు ఇలా మాట్లాడి ఉండ కూడదు" అనే స్పష్టమైన, నిర్దిష్టమైన, రాజకీయంగా అసౌకర్యం కలిగించే హెచ్చరిక చేసినట్లు ఎక్కడా ఆధారాలు కనిపించలేదు. అందుకే ఇప్పుడు అమెరికా వేదికపై భగవత్ ఇచ్చిన ఉపన్యాసాన్ని లేదా హితోక్తుల మాటలను భారత ప్రజలు సహజంగానే ప్రశ్నిస్తున్నారు.

## జన్-జీ యువతపై బలప్రయోగం—కొత్త రాజకీయ మలుపు:

ఇటీవలి కాక్రోచ్ జనతాపార్టీ, విద్యార్థి, యువజన ఉద్యమాలు ఈ ప్రశ్నను మరింత పదును పెట్టాయి. పరీక్షా పేపర్ లీకులు, నియామక పరీక్షల్లో అవకతవకలు, నిరుద్యోగం వంటి సమస్యలపై యువత దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతోంది. ఆగస్టు 25న బీహార్‌లో పరీక్షా అవకతవకలపై నిరసనకు దిగినవారిపై పోలీసులు వాటర్ కేనన్లు ఉపయోగించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఢిల్లీలో జూలై 20 విద్యార్థి నిరసన సందర్భంగా 19 ఏళ్ల సహిల్ లోచబ్ పై నిషేధిత "పెల్లెట్ గన్" గాయాలకు గురయ్యాడన్న ఫిర్యాదు మరింత తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ఈ విషయంలో పోలీసులు మొదట ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపణలు వచ్చాయి. ఆ తరువాత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బాధితుడితో కలిసి పోలీస్ స్టేషన్ వద్ద గంటల తరబడి ధర్నా చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇది కేవలం కాంగ్రెస్-బీజేపీ వివాదంగా చూడటం తప్పు. ప్రజాస్వామ్యంలో శాంతి యుతంగా నిరసన తెలిపే యువకుడి శరీరానికి పెల్లెట్లు తగిలితే, అధికార వ్యవస్థకు జవాబుదారీతనం ఉండాలా లేదా? అన్నది రాజ్యాంగ ప్రశ్న. దేశంలో యువత తమ భవిష్యత్తు గురించి ప్రశ్నిస్తున్నప్పుడు, వారికి సమాధానం ఇవ్వాల్సిన చోట అధికార యంత్రాంగం బలప్రయోగం చేస్తే, ఆ సమయంలో ఆర్ఎస్ఎస్ నాయకత్వం ప్రజాస్వామ్య హక్కుల పక్షాన ఆచరణలో ఎంత బలంగా నిలబడిందన్నదీ ప్రశ్నించాల్సిందే.

## ఖర్గే 'శుద్ధీకరణ' ఘటన మరో ఖండించ తగిన అంశం:

ఇటీవల ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో తరువాత "శుద్ధీకరణ హవన్" నిర్వహించడం మరో వివాదానికి దారితీసింది. ఇది ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి. ఖర్గే దీనిని తన దళిత గుర్తింపుతో ముడిపడిన అవమానంగా చూశారు. కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. మరోవైపు బీజేపీ ఈ కార్యక్రమంతో తనకు లేదా ఆర్ఎస్ఎస్‌కు సంబంధం లేదని స్పష్టం చేసింది. నిర్వాహకులు కూడా వేదికపై మురికి కారణంగానే శుద్ధీకరణ చేశామని వివరణ అయితే ఇచ్చారు. కానీ అక్కడ ప్రజలు ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన సమాధానం భిన్నంగా ఉంది. అయితే ఇక్కడ కూడా అసలు ప్రశ్న వేరే. కుల అవమానంగా కనిపించే చర్య జరిగినప్పుడు, సామాజిక సమానత్వం గురించి ఆర్ఎస్ఎస్ నాయకత్వం మరింత స్పష్టమైన నైతిక గీత గీయాల్సిన అవసరం ఉండింది.కానీ ఎటువంటి ప్రకటనా ఆరెస్సెస్ నుండి రాలేదు కదా? అనేదే మరో మౌలిక ప్రశ్న?

## రామమందిరం విరాళాల కేసు కూడా మౌనమే సమాధానం:

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తులో నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక నిందితుడి నుంచి రూ.20.39 లక్షల నగదు, మరోచోట సుమారు 11 గ్రాముల బంగారం, 375 గ్రాముల వెండి, 1,121 అమెరికన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఇండియా టుడే నివేదించింది. కానీ ఈ కేసులో నిందితులందరూ "ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు"గా నిర్ధారించడం ఆధారాల్లేకుండా కామెంట్స్ చేయకూడదు. నేరం చేసిన వ్యక్తి ఏ సంస్థకు చెందినవాడో, ఏ సంస్థకు అధికారిక సంబంధం ఉందో దర్యాప్తు ద్వారా నిర్ధారించాలి. ఇదే ప్రజాస్వామ్య విమర్శకు అవసరమైన నిజాయితీ.కానీ రామమందిరం నిర్మాణం నుంచి అందులో పెత్తనం చేసే వారు, విధి నిర్వహణలో ఉన్న వారు అందరూ ఆరెస్సెస్ కి సంబంధించిన వారికి తప్ప మరొకరికి స్థానం లేదు అనేది జగమెరిగిన సత్యం.

## మరి ఇది నిజమైన మార్పా?

భగవత్ తాజా మాటలను పూర్తిగా కొట్టిపారేయడం కూడా సరైన విశ్లేషణ కాదు. ఎందుకంటే ఇదే తరహా సమగ్రతా వ్యాఖ్యలు ఆయన గతంలో కూడా కొన్ని సార్లు చేశారు. 2018లోనే హిందూ రాష్ట్రం అంటే ముస్లింలు లేని దేశం కాదని ఆయన చెప్పిన విషయాన్ని ఇండియా టుడే గుర్తుచేసింది. అంటే ఇది ఒక్కసారిగా 2026లో పుట్టిన సిద్ధాంతం కాదు. అయితే మాటల పునరావృతం ఒక విషయం; ఆ మాటలకు అనుగుణంగా సంస్థాగతంగా, రాజకీయంగా, సామాజికంగా వ్యవహరించడం మరో విషయం. ఇదే భగవత్ ముందున్న అతిపెద్ద పరీక్ష.

## ఆర్ఎస్ఎస్ నిజంగా మారిందనుకుంటే...

మత ద్వేషపూరిత ప్రసంగాలను బహిరంగంగా ఖండించాలి. ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మైనారిటీలపై దాడులు జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలను కోరాలి కదా?. బుల్డోజర్ న్యాయానికి స్పష్టంగా వ్యతిరేకంగా నిలబడాలి కదా? . దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల అవమానాన్ని నిర్ద్వంద్వంగా ఖండించాలి కదా?. విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేస్తే వారి హక్కులను సమర్థించాలి. బీజేపీ నాయకుల నుంచైనా, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల నుంచైనా ద్వేషపూరిత భాష వస్తే సంస్థాగతంగా చర్యలు తీసుకోవాలి. అప్పుడు మాత్రమే ఆరెస్సెస్ లో" గుణాత్మకంగా మార్పు వచ్చింది " అన్న నమ్మకం, దృఢ విశ్వాసం ప్రజల్లో ఏర్పడుతుంది.

## బీజేపీ–ఆర్ఎస్ఎస్ మధ్య విభేదాలా?

ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. భగవత్–మోదీ మధ్య సైద్ధాంతిక లేదా వ్యూహాత్మక దూరం పెరుగుతోందా? ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాలతో "బీజేపీ–ఆర్ఎస్ఎస్ సంబంధాలు తెగిపోయాయి" అని చెప్పటాకి ఏలాంటి బహిరంగంగా ఆధారాలు లేవు. ఆర్ఎస్ఎస్ ఇప్పటికీ బీజేపీకి ప్రధాన సైద్ధాంతిక భూమిక కలిగిన ఆధార సంస్థగా పరిగణించబడుతోంది. అదే సమయంలో భగవత్ ఇటీవలి ప్రసంగాలు బీజేపీ రాజకీయ భాషతో కొంత మేరకు డ్యామేజ్ నివారణ కోసం గతంలో కంటే మరింత సమన్వయపూర్వక ధోరణి కనిపిస్తున్నాయి. కాబట్టి ఇది పూర్తి విభేదం కంటే రాజకీయ దోషాల నుండి బయటపడే ఒక ఎత్తుగడ కావచ్చనే విశ్లేషణ బలంగా కనిపిస్తోంది. ఒకవైపు ఎన్నికల రాజకీయానికి భవిష్యత్తులో మెజారిటీ సమీకరణ కూడా అవసరం. మరోవైపు 2026లో శతాబ్ది సంవత్సరాన్ని జరుపుకుంటున్న ఆర్ఎస్ఎస్‌కు అంతర్జాతీయంగా "మత ఆధిపత్య సంస్థ" అనే ముద్ర ఇబ్బందికరంగా మారుతోంది. అందుకే ప్రపంచ వేదికలపై "వసుధైవ కుటుంబకం", "ఏకత్వంలో భిన్నత్వం", "ముస్లింలు భారత్‌లో భాగమే" వంటి సందేశాలను బలంగా ముందుకు తెస్తున్నదనే విమర్శకు బలం చేకూరుతుంది. ఎకనామిక్ టైమ్స్ కూడా భగవత్ అమెరికా పర్యటనను ఆర్ఎస్ఎస్‌కు మరింత సమన్వయ పూర్వకమైన అంతర్జాతీయ రూపాన్ని చూపించే ప్రయత్నంగా విశ్లేషించింది.

## చివరిగా "సిద్ధాంత పంథా మౌలికంగా మారిందా? వ్యూహాల మార్పేనా?

ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిణామాలను కలిపి చూస్తే, "ఆర్ఎస్ఎస్ పూర్తిగా మారిపోయింది" అని చెప్పడానికి ఇంకా ఆధారాలు లేవు. అదే సమయంలో "మోహన్ భగవత్ మాటలన్నీ కేవలం బూటకం" అని నిర్ధారించలేం కూడా. అలాగే అంతర్గతంగా బాహ్యంగా వచ్చే విమర్శల ఘాఢతను తగ్గించే చర్యలు కావచ్చు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. ప్రజలు ఇక మోదీ, అమిత్ షా,మోహన్ భగవత్ మాటలను గతంలో వలే యధాతథంగా గుడ్డిగా విని ఆచరించే పరిస్థితి లేదు.

అమెరికాలో "ముస్లింలు భారతదేశంలో ఉండకూడదని అనుకునే వ్యక్తి హిందువు కాదు" అని చెప్పడం చప్పట్లు తెచ్చుకోవచ్చు. కానీ భారతదేశంలో ముస్లింల ఇళ్లు కూల్చబడినప్పుడు, ద్వేష ప్రసంగాలు జరిగినప్పుడు, మైనారిటీలు దాడులకు గురైనప్పుడు, యువత నిరసనలపై అధిక బలప్రయోగం జరిగినప్పుడు, దళిత అవమాన ఆరోపణలు వచ్చినప్పుడు అదే నైతిక ధైర్యంతో మాట్లాడకుండా—మౌనం వహించి, ఇప్పుడు సమన్వయ శాంతి ప్రవచనాలు మౌలిక సిద్ధాంత మార్పుకు సాక్ష్యం కావు. అవి కేవలం ఇమేజ్ మేనేజ్‌మెంట్‌లో భాగం గా కనిపిస్తోంది.

ఇప్పుడు భగవత్‌కు ఎదురవుతున్న అవకాశం, సవాల్ కూడా ఇదే. ముస్లింలు భారత్‌లో ఉండటమే హిందుత్వానికి విరుద్ధం కాదని చెప్పడం మొదటి అడుగు మాత్రమే. ముస్లింలను ద్వేషించే రాజకీయాన్ని, భౌతిక హింసా కాండను, బహిరంగ వివక్షతను, చట్టవ్యతిరేక బల ప్రయోగాన్ని, అది బీజేపీ చేతిలో ఉన్నా, ఆరెస్సెస్ లోని వివిధ రకాల శ్రేణులుల్లోని కార్యకర్తల ప్రవర్తనలో ఉన్నా ... బహిరంగంగా తిరస్కరించడం, అంతర్గత తాత్విక సంస్కరణలు చేపట్టి,ఆచరణలో చూపించటం రెండో అడుగు అవుతుంది.

## ఆ రెండో అడుగు పడే వరకు దేశ ప్రజలు అడిగే ప్రశ్న ఒక్కటే:

"మోహన్ భగవత్ కేవలం ప్రస్తుత పరిస్థితుల్లో ఎదురవుతున్న జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న విమర్శలను ఎదుర్కొనే వ్యూహాత్మక ఎత్తుగడలో భాగంగా మాట మార్చారా? లేక ఆత్మ పరిశీలనతో, చిత్తశుద్ధిలో వచ్చిన పరివర్తనలో నిజమైన మార్పా!? అనేది భవిష్యత్తు కాలంలో కార్యాచరణ నిర్ణయిస్తుంది. ఈ ప్రశ్నలకు సమాధానం అమెరికా వేదికపై కాదు—"భారతదేశంలో ఆర్ఎస్ఎస్ మరియు బీజేపీ రేపటి ఆచరణలోనే నిజాల నిగ్గు తేలాలి."

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.